క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్, ఊటిపెల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లోని వసతులను శుక్రవారం సెక్టోరియల్ అధికారి నార్సింగ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, నీటి వసతి గురించి బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపులను ఏర్పాటు చేయించాలన్నారు. ఆయన వెంట బీఎల్వోలు శారద, మల్లీశ్వరి, జలజ, లక్ష్మి ఉన్నారు.

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: పారిశుధ్యం లోపిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రభు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రాపూర్ తండాలో డ్రైడేను పురస్కరించుకుని ఇంటింటికీ తిరిగి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇళ్లలో నిలువ ఉంచిన నీటిని పారబోయించారు. ఎక్కడైనా మురికి కనబడితే వెంటనే బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమల నివారణకు మందులను స్ప్రే చేయాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి




మాట్లాడుతున్న వైద్యశాఖ ఆఫీసర్

కథలాపూర్: సీజనల్ వ్యాధులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎం.డీ సమియోద్దీన్ అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలకేంద్రంలోని మాస్టో హైస్కూల్‌లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం ఒక్కసారిగా చలిగా మారిందని, జలుబుల బారిన పడే అవకాశాలుంటాయన్నారు. విద్యార్థులు మాస్కులు ధరించాలన్నారు. జలుబు, జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ భూషణ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ ప్రవర్తనా నియమావళి పాటించాలి

మల్యాల: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు మోడల్ ప్రవర్తనా నియమావళి పాటించాలని ఎంసీసీ టీం లీడర్, ఎంపీడీవో వెంకటేశం అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా శుక్రవారం మల్యాల మండలంలోని నూకపల్లి, మద్దుట్ల, పోతారం, రాజారం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కట్టవద్దని, గోడలపై రాజకీయ పార్టీలు తమ పార్టీ విధానాలు రాసుకునేందుకు ఇంటి యజమాని అనుమతితోపాటు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు.

విశ్వరూప సన్నాహక సదస్సు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాయికల్: ఎస్సీ వర్గీకరణ కోసం నవంబర్ 2న జగిత్యాల జిల్లా కేంద్రంలో తలపెట్టిన మాదిగల విశ్వరూప సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ, విశ్వరూప సన్నాహక సదస్సుకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలం నుంచి దళితులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలోనాయకులు నర్సయ్య, బాలరాజు, నారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్,



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

జగిత్యాల: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం 44, 46 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం, మైనార్టీ యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గెలుపు కోసం కృషి చేయాలని, ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సమానంగా నిధులు కేటాయిస్తూ అందరి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, బీఆర్ఎస్‌కే మీ ఓటు వేయాలని ప్రజలను కోరారు. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వంలో జగిత్యాల అభివృద్ధి వందరెట్లు జరిగిందనితెలిపారు.బీఆర్ఎస్ నాయకులున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సంక్షేమ పథకాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ, జగిత్యాల నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎల్.రమణ అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు నిరంతరం శ్రమించి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబంధు పథకంపై ఈసీకి ఫిర్యాదు గర్హనీయం



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

మల్లాపూర్: రైతుబంధు సాయాన్ని నిలిపివేయాలని ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు చేయడం గర్హనీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంట్ వంటి పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుంటే కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. రైతన్నలను కష్టాల పాలు చేసేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎక్కడిక్కడ ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్, ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ ముద్దం శరత్‌గౌడ్, నాయకులు ద్యాగ గంగారెడ్డి, బదినపెల్లి ప్రేమ్, సరికెల మహిపాల్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, మ్యాకల సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన యూత్ సభ్యులు



బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన రాయల్ రెడ్డీస్ యూత్ సభ్యులు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు మాజీ ఎంపీటీసీ మామిడిపెల్లి రవి తెలిపారు. వేములవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో కథలాపూర్‌కు చెందిన రాయల్ రెడ్డీస్ యూత్‌సభ్యులు 30 మంది పార్టీలో చేరగా, వారికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనరసింహారావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

ఎంపీ అర్వింద్‌కు ఘన స్వాగతం



బీజేపీలో చేరుతున్న మాజీ కౌన్సిలర్లు జక్కుల జగదీశ్వర్, జమున



మెట్‌పల్లిరూరల్: కోరుట్ల బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన మొదటిసారి నియోజకవర్గానికి విచ్చేసిన ఎంపీ అర్వింద్‌కు మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలో పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా అర్వింద్ గండి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో ముచ్చటించారు. అంతకుముందు అర్వింద్ కాన్వాయ్‌ని అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు.

బీజేపీలో పలువురి చేరిక

కోరుట్ల: బీజేపీ కోరుట్ల నియోజకవర్గ అభ్యర్థి ఎంపీ అర్వింద్ సమక్షంలో శుక్రవారం పలువురు బీజేపీలో చేరారు. వీరికి ఎంపీ అర్వింద్ కాషాయ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ కౌన్సిలర్లు జక్కుల జగదీశ్వర్, జక్కుల జమున, మోహన్‌రావుపేట సింగిల్ విండో వైస్ చైర్మన్ బొలిశెట్టి రాజేందర్, చౌలమద్ది కాంగ్రెస్ నాయకులు అల్లూరి రాజేశ్వర్, మల్లాపూర్ బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, జోగన్‌పల్లి ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి తదితరులు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు.

గడప గడపకు బీఆర్ఎస్ నేతల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి, భూషణరావుపేట, పెగ్గెర్ల గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు గడప గడపకు ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన కోట శంకర్ బీఆర్ఎస్‌లో చేరగా.. పార్టీ కండువా కప్పారు. కథలాపూర్, సిరికొండ గ్రామాల్లో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఎంపీటీసీలు కొండ ఆంజనేయులు, దొప్పల హైమావతి, నాయకులు తీట్ల శంకర్, తరి రమేశ్, వినోద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల వరకు ప్రచారం ఉండొద్దు



సమావేశమైన అధికారులు

సారంగాపూర్: పోలింగ్ కేంద్రాల నుంచి 200 మీటర్ల దూరం వరకు ఎలాంటి ప్రచారం ఉండకూడదని తహసీల్దార్ తాఫాజుల్లా హుస్సేన్, ఎంపీడీవో రాజేందర్ అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండల ఎమ్మార్సీ భవనంలో హెచ్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించారు. ఈసందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలు నిర్వహించే పాఠశాలలు, ప్రభుత్వ భవనాల నుంచి 200 మీటర్ల దూరం వరకు ఎలాంటి ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్స్, హోర్డింగులు ఉండకూడదని దీనికి తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి మధ్యాహ్న భోజన కార్మికులు అల్పాహారం, భోజనం, టీ అందించాలని, బయట నుంచి ఏలాంటి ఆహారం అనుమతించబోమన్నారు. సమావేశంలో ఎంఈవో వాసం భీమయ్య, హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

కమ్మరిపేటలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: భీమారం మండలం కమ్మరిపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. గడప గడపకూ వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ కి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మీద బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నరేశ్ రెడ్డి, రాజశేఖర్, చుక్క తిరుపతి, లింగయ్య, రెండ్ల మధు, జవ్వాజి రాజు, లక్ష్మణ్, గంగమల్లయ్య గంగారెడ్డి పాల్గొన్నారు.

31న కంటి వైద్యశిబిరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

మల్లాపూర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ రీజినల్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మొగిలిపేటలో కంటి వైద్యశిబిరం కరపత్రాలను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్, రీజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్‌లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 31మొగిలిపేటలో రేకుర్తి కంటి ఆస్పత్రి సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డులు తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి తోట రాజరెడ్డి, సభ్యులు తోకల రాజు, స్థానికులు అక్షింతల లక్ష్మీనారాయణ, చందు, రమేశ్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పార్టీల మేనిఫెస్టోల్లో చేర్చాలి

జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోల్లో పొందు పరచాలని జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పులి మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రత్రికా ప్రకటన విడుదల చేశారు. జీపీ కార్మికుల సమస్యలపై ఎన్ని ఆందోళనలు చేసినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. కార్మికులంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారేనన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోల్లో పొందుపరిచి కార్మికులకు భరోసా కల్పించాలని కోరారు.

హరిహర క్షేత్రం నుంచి పాదయాత్ర

మల్యాల: మండల కేంద్రంలోని హరిహర క్షేత్రం నుంచి అయ్యప్పస్వామి దీక్షా పరులు శుక్రవారం పాదయాత్రగా బయలు దేరారు. మల్యాల, పాలాస, కోరుట్ల, మెట్‌పల్లి, బండలింగాపూర్‌కు చెందిన దీక్షాపరులు మల్యాలలోని హరిహరక్షేత్రంలో పూజలు చేసి, అక్కడి నుంచి శబరికి పాదయాత్రగా బయలుదేరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రాయికల్: మండలంలోని కిష్టంపేటలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ జయంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అక్షరాస్యులైనప్పుడే కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయని, అంతేకాకుండా ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జానస్వరూప, ఉపసర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, సీఏలు నవత, విజయ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 2008–09లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులంతా వాల్గొండలోని గోదావరి నది తీరాన కలిసి అపూర్వ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 15 ఏళ్ల చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆటాపాటలతో సంతోషంగా గడిపారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ ఆనందోత్సాహాలతో మునిగిపోయారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకులు పని చేసే వాళ్లు కాదు

- బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్



ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న డాక్టర్ సంజయ్

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజలకు పనిచేసే వాళ్లు కాదని, వాళ్లను నమ్మొద్దని బీఆర్ఎస్ పార్టీ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండ, కొమటికొండాపూర్ గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్లు పాలించి ప్రజలకు తాగు,సాగునీరు, కరెంట్ కూడా ఇవ్వలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో 9 ఏళ్లుగా సిలిండర్ ధర , పప్పుల ధరలు పెంచిందన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ గెలిచి ఇనేళ్లుగా ప్రజలకు కనబడలేదని, మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని, అటువంటి నాయకులను నిలదీయ్యాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కమటం భారతి, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లాల దశరథ్ రెడ్డి, సర్పంచులు,ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలే కీలకం

రానున్న ఎన్నికల్లో బూత్ కమిటీలే కీలకమని, బూత్ కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో సాయంత్రం వేంకటేశ్వరస్వామి కళ్యాణమండపంలో మండల స్థాయి బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. నవంబర్ 3 న కోరుట్లలో జరిగే సీఎం సభకు పెద్ద ఎత్తున జనాన్ని తరలించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, జెడ్పీటీసీ,ఎంపీపీ, నాయకులు పాల్గొన్నారు.

తనయుడి కోసం తల్లి ప్రచారం



మెట్‌పల్లి: కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కు మద్దతుగా అతని తల్లి సరోజనమ్మ బుధవారం పట్టణంలోని 11 వార్డు వెంకట్రావ్‌పేటలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, నాయకులు ఉన్నారు.

కుమురం భీం ఆశయాల కొనసాగింపునకు కలిసిరావాలి



నివాళి అర్పిస్తున్న ఆదివాసీలు

సారంగాపూర్: జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో ముందుకు సాగిన కుమురం భీం ఆశయాలను కొనసాగించడానికి ఐక్యతతో పనిచేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు చిత్రం మారుతి అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెంలో కుమురంభీం వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గిరిజనులకు పోడు భూముల్లో పూర్తిస్థాయి పట్టాలు అందించి, ఆ భూములను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు మరిన్ని నిధులు వెచ్చించాలని కోరారు. గ్రామల్లో గిరిజన గూడెంలను పంచాయతీలుగా ఏర్పాటు చేసినప్పటికి పూర్తిస్థాయిలో నిధులు లేక అభివృద్ధి చెందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో మరిన్ని గిరిజన ఆదివాసీ గూడెంలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు త్రం రవీందర్, పెంద్రం శ్రీనివాస్, నాయకులు కుడిమెత గంగారాం, సిడం బిలాజీ, నడిపిరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థికి సన్మానం

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో శుక్రవారం ఎంబీబీఎస్ సీటు సాధించిన జోగ కార్తీక్‌ను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కార్తీక్ ప్రతిభ కనబర్చి ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. అధ్యాపకుల సమష్టి కృషికి తోడు కార్తీక్ ప్రతిభ పాటవాలు తోడవడంతోనే ఎంబీబీఎస్ సీటును సాధించాడని కొనియాడారు. విద్యార్థుల్లోని ప్రతిభ, అధ్యాపకుల మెరుగైన మార్గదర్శకత్వంతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. కార్తీక్ తల్లిదండ్రులతో పాటు గ్రామానికి పేరు తీసుకువచ్చాడన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు వీరబత్తిని శ్రీనివాస్, శ్రీకాంత్, రాజేష్, ప్రభాకర్, రమేశ్, రణదేవ్, మల్లేశ్, ఆనంద్, సతీశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులపై మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పలు వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రైయినేజీలు వెంట వెంటనే శుభ్రం చేయాలని, పట్టణ శివారు వార్డుల్లో ఉన్న చెట్ల పొదలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

ధర్మపురి: పోలీస్ అమర వీరుల సంస్మరణ వేడుకల్లో భాగంగా పోలీసులు నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరం పలువురు యువకులు రక్తదానం చేశారు. సీఐ రమణామూర్తి, ఎస్సై దత్తాత్రి పిలుపు మేరకు మల్లాపూర్ గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం జిల్లాలోని విరూపాక్షి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. పూదరి రాజు, తిరుపతి గౌడ్, గడ్డం శ్రీనివాస్, కాసారపు సాయిగౌడ్, ఉయ్యాల సత్యం, శ్రీకాంత్‌గౌడ్, గర్వందుల మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు. రక్తదాతలకు సీఐ, ఎస్సై కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ యూత్ అధ్యక్షుడి రక్తదానం

మల్యాల: మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు దొంతరవేని శేఖర్ శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. గతంలో మల్యాల మండల కేంద్రంలో బస్టాప్ నిర్మాణం కోసం రూ.3 లక్షలు విరాళం అందజేశారు. సామాజిక సేవ చేయడంలో ఉన్న తృప్తి ఎనలేనిది శేఖర్ అన్నారు. రక్తదానం చేసిన శేఖర్‌ను సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్సై తీగల అశోక్ అభినందించారు.

విద్యార్థినికి అభినందన

ఇబ్రహీంపట్నం: కరీంనగర్‌లో ఈ నెల 21న ఆల్‌ఇండియా ఓపెన్ చెస్ కాంపిటీషన్ పోటీల్లో ఇబ్రహీంపట్నం కాకతీయ విద్యాలయానికి చెందిన 4వ తరగతి విద్యార్థిని మారెడు చరణి అండర్ – 9 కాంపిటేషన్‌లో 3వ ర్యాంకు సాధించింది. ఈ విద్యార్థికి ఓపెన్ చెస్ పోటీల ఆర్గనైజర్లు విశ్వంత ప్రసాద్, చంద్రమౌళి కప్పు అందచేశారు. శుక్రవారం పాఠశాలలో కరస్పాండెంట్ సంజయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడాలి



పంట ధ్వంసం చేసిన అడవి పందులు

సారంగాపూర్: వరిపొలాల్లో అడవి పందులు చొరబడి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరిపంట కోత దశకు ఉంది. రాత్రిపూట అడవిపందులు పదుల సంఖ్యలో వస్తూ పంటలకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు బొర్నకుంట నర్సింగం, చాతరాసి సురేశ్ వాపోయారు. చేతికందిన పంటను ధ్వంసం కావడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. అటవీప్రాంతాలకు ఆనుకొని ఉన్న పొలాల్లో ఎక్కువ నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అడవి పందుల బెడదకు చర్యలు తీసుకొని పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.